క్లుప్తంగా

సేవల వివరాలను ప్రదర్శించాలి

• డీఎంహెచ్‌ఓ సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్స్, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు నిర్వహించే వారు ఆయా సేవల ధరల వివరాలను ప్రజలకు తెలిసే విధంగా నోటీసు బోర్డులో ప్రదర్శించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత సూచించారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ అల్లోపతి ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం రేట్ల వివరాలను స్థానిక, ఆంగ్ల భాషలో రిసెప్షన్ కౌంటర్‌లో కనిపించే విధంగా ప్రదర్శించాలన్నారు. సేవల ప్రతిని, రేట్ బోర్డును ఫొటో తీసి జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి అందజేయాలన్నారు.

పిల్లలతో భిక్షాటనపై తనిఖీలు

నెల్లూరు (పొగతోట): చిన్న పిల్లలతో భిక్షాటనపై తనిఖీలు నిర్వహించి వారి సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటామని బాలల సంరక్షణాధికారి సురేష్ సోమవారం తెలిపారు. నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం వద్ద ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పిల్లలు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తుండగా, దీనిపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. నలుగురు పిల్లలను వాత్సల్య హోమ్‌లో చేర్పించి వారి సంరక్షణకు చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు.

ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

నెల్లూరురూరల్: తపాలా శాఖలో జీవిత బీమా పాలసీల సేకరణకు నూతన ఏజెంట్ల నియామకం కోసం ఈనెల 23 నుంచి 31 వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని నెల్లూరు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18–65 ఏళ్ల వారు దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నెల్లూరు పోస్టల్ డివిజనల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 0861–2331748 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జెడ్పీ పాఠశాల భవనం ప్రారంభం

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని ఒకటో డివిజన్ నారాయణరెడ్డిపేటలో దోబీఘాట్, కోడూరుపాడులోని జెడ్పీ పాఠశాల భవనాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాకంబరిగా అమ్మవార్ల దర్శనం



నెల్లూరు(బృందావనం): ఆషాఢమాసం సందర్భంగా విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి వేదమాత మహాగాయత్రిదేవి, మహాలక్ష్మి, గోవిందమాంబ అమ్మవార్లు శాకంబరి అలంకారంలో భక్తులను కటాక్షించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవ గావించారు. ఉభయకర్తలుగా గుమ్మడిపూడి సురేష్ ఆచారి–కృష్ణవేణి దంపతులు వ్యవహరించారు.

వడ్డెర మహాసభల విజయవంతానికి పిలుపు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో నిర్వహించనున్న ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పిలుపునిచ్చారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డు వద్ద ఉన్న భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో సోమవారం వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27, 28వ తేదీల్లో వడ్డెర వృత్తిదారుల రాష్ట్ర మహాసభలు ఉంటాయన్నారు. అనంతరం వడ్డెర సమస్యలపై రూపొందించిన సీడీలను ఆవిష్కరించారు. సంఘ నాయకులు వెంకటేష్, బాల వెంకటేశ్వర్లు, నాగార్జున, నాగరాజు, వెంకయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై చర్యలు చేపట్టాలి

వెంకటాచలం: తమ గ్రామంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అనికేపల్లి గ్రామస్తులు పలువురు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం వారు నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన్ను కలిసి సమస్యను వెల్లడించారు. గ్రామంలోని మూడు బెల్టు షాపులతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలు మార్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బెల్టు దుకాణాలతో నిత్యం గొడవలు జరుగుతున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



బురదలో చిన్నారుల అవస్థలు



చిరు వర్షానికే చిత్తడి

• ప్రపంచ స్థాయి వసతుల వీఆర్సీ పాఠశాలలో దుస్థితి

నెల్లూరు నగరంలో చారిత్రక ప్రసిద్ధి కలిగిన వీఆర్సీ పాఠశాలను ఇటీవల ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. సీఎస్సార్ ఫండ్స్ ద్వారా ప్రపంచ స్థాయి వసతులతో ఈ పాఠశాలను తీర్చిదిద్దినట్లు మంత్రి నారాయణ ప్రచారాలు కూడా చేసుకున్నారు. ఇది జరిగి నెల కూడా గడవక ముందే ఆదివారం రాత్రి కురిసిన చిరు వర్షానికే పాఠశాల ప్రాంగణం చిత్తడిగా మారింది. అడుగు వేయలేని స్థితిలో బురదమయమైంది. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఎవరూ పట్టించుకోలేదు. ఫలితంగా సోమవారం పాఠశాలకు వచ్చిన చిన్నారులు తీవ్ర ఇబ్బందుల నడుమ పాఠశాలకు వెళ్లాల్సి వచ్చింది. ఎక్కడ బురదలో జారి పడతమో అని భయం భయంగా పాఠశాలకు వెళ్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



బురదలో జారి పడకుండా పాఠశాల గోడ వెంబడి జాగ్రత్తగా వెళ్తున్న విద్యార్థులు



చిత్తడిగా మారిన పాఠశాల ప్రాంగణం



చెరువును తలపిస్తున్న మైదానం

సంక్షేమ పథకాల అమలుకు డిమాండ్



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అంగన్‌వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రెహనా బేగం, సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలపై యాప్‌ల భారం తగ్గించాలని, గతంలో అమలు చేసిన జీఓ ప్రకారం ప్రభుత్వ పథకాలకు అర్హులుగా ప్రకటించాలన్నారు. యూనియన్ నాయకులు నరసింహారెడ్డి, శివాజీ, రజిని, కామాక్షి, మల్లెమ్మ, శాంతి, నాగభూషణమ్మ, మాధవి, రమాదేవి, సుమతి, ఉషా, కల్పన పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

నెల్లూరురూరల్: అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పనులు, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు తదితర అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అశ్రద్ధగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. ఉపాధిహామీ పనిదినాలను పెంచి కూలీలకు పనులు కల్పించాలన్నారు. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో హుస్సేన్ సాహెబ్, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్‌ఈ విజయన్, డీఈఓ బాలాజీరావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

కంపోస్టబుల్ ఉత్పత్తులను వాడాలి

జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు కంపోస్టబుల్ ఉత్పత్తులను వాడుకోవాలని, దీనిపై ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కంపోస్టబుల్ ఉత్పత్తుల గురించి సోమవారం డెమో నిర్వహించారు. ఎలైట్ బయో ప్రొడక్ట్స్, లక్ష్మీ పాలిమర్స్ ఉత్పత్తులు సహజసిద్ధంగా ఆరు నెలల తర్వాత భూమిలో కలిసిపోతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన కాకాణి పూజిత

పొదలకూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎండగట్టాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పొదలకూరులోని కల్యాణ మండపంలో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోపై కార్యకర్తలతో ఆమె సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. చంద్రబాబు వందల సంఖ్యలో హామీలిచ్చారని, ఆయన సహజ ధోరణిలోనే వాటిని అమలు చేయడం లేదన్నారు. తల్లికి వందనం పథకం నగదు అరకొరగా బ్యాంక్ ఖాతాల్లో వేసి, పూర్తి చేశామని ప్రచారం చేసుకుంటున్నట్టు విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. రైతుభరోసా పథకాన్ని నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్వేపల్లిలో ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చినట్లు వెల్లడించారు. అనంతరం క్యూర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ ఎన్నిక

నెల్లూరురూరల్: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.వంశీధర్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేష్, పొన్నూరు మాధవి, బత్తల కృష్ణయ్య, శ్రీనివాసులు, చీదర్ల శివపార్వతి, ప్రధాన కార్యదర్శులుగా యశ్వంత్‌సింగ్, బెల్లంకొండ మాల్యాద్రి, యాకసిరి ఫణిరాజు, కార్యదర్శులుగా కర్తంపాటి సుధాకర్, మారెళ్ల బ్రహ్మారెడ్డి, ముక్కు రాధాకృష్ణ, సుజన, వడ్డే శ్రీనాథ్, అల్లూరు నాగవేణి, మేడపల్లి రత్నం నాయుడు, కోశాధికారిగా సీవీ రత్నం, సోషల్ మీడియా కన్వీనర్‌గా సన్నారెడ్డి సాయికుమార్, ఐటీ సెల్ కన్వీనర్‌గా బుజ్జి రామకృష్ణలను ఎంపిక చేశారు.

విద్యార్థినులకు అవగాహన

నెల్లూరు (టౌన్): మాదక ద్రవ్యాలు, బాలికల అక్రమ రవాణాపై స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి పాల్గొని, మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, అక్రమ జరుగుతున్న విధానాలు, వాటి బారిన పడకుండా రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, సెట్నెల్ సీఈఓ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒత్తిడికి గురి కావద్దు

నెల్లూరు(అర్బన్): శరీరంలో మెదడు చాలా కీలకమని, ఈ క్రమంలో ఒత్తిడికి గురి కావద్దని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ న్యూరో సర్జన్ దినేష్‌కుమార్ అన్నారు. ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయన నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో మెదడు రక్షణపై అవగాహన కల్పించారు. ప్రస్తుత జీవన శైలిలో ఒత్తిడి, సరైన నిద్రలేకపోవడం, పోషకాహార లోపం, శారీరక శ్రమ లేకపోవడం లాంటి అంశాలు మెదడు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ క్రమంలో సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యాయామం, రోజుకు 7 నుంచి 8 గంటల పాటు నిద్రపోవడం ద్వారా మెదడు సక్రమంగా పనిచేస్తుందన్నారు.

డాక్టర్ వై.రాముకు అవార్డు



నెల్లూరు(అర్బన్): నగరంలో 30 ఏళ్లుగా డాక్టర్ ఏల్చూరి రాము డయాబెటాలజిస్ట్‌గా వేలాది మంది రోగులకు సేవలందిస్తున్న నేపథ్యంలో ఆయనకు డాక్టర్స్ డే అవార్డు దక్కింది. మినీ బైపాస్‌రోడ్డులోని జీపీఆర్ గ్రాండ్‌లో డాక్టర్స్ డే సంబరాలు నిర్వహించారు. ఈ క్రమంలో డాక్టర్ల కుటుంబ సభ్యులతో ఆత్మీయ సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ రాముకు అవార్డును అందజేసి సన్మానించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, ఐఎంఏ జిల్లా ప్రెసిడెంట్ అమరేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వేగవంతంగా 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' పనులు

• కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): వీధి వ్యాపారుల కోసం పైలట్ ప్రాజెక్ట్ కింద చేపడుతున్న 'స్మార్ట్ స్ట్రీట్ బజార్' పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అధికారులను ఆదేశించారు. స్థానిక మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి నారాయణ ఆలోచనలతో రూపొందుతున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాజెక్టును అన్ని విభాగాల అధికారుల సమన్వయంతో వేగవంతంగా పూర్తి చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతు జానీ, డీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



మైపాడురోడ్డులో పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రతిభా పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం): జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన ఏడుగురు విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పురస్కారాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు చెలంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.3 వేలు వంతున అందజేసి అభినందించామన్నారు. అనంతరం పాఠశాలల హెచ్‌ఎం పీవీ కృష్ణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించి సన్మానించారు. డిస్ట్రిక్ట్ 203 ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, సంఘ గౌరవాధ్యక్షులు మెట్టు సుధాకర్‌రెడ్డి, తుంగా నారాయణరెడ్డి, మహిళా కార్యదర్శి హర్షవర్ధిని, ఎస్తేర్ రాణి, మేరి బ్లెస్సింగ్టన్, మెట్టు సుజన, ఖాజామస్తాన్, చెంచయ్య, బాలసుబ్రహ్మణ్యం, విమలకుమారి, చెంచురామమూర్తి, వీరగంధం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పించండి

నెల్లూరు రూరల్: గ్రామ సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా చనిపోయిన నా భర్త డెత్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన ఇండ్ల లక్ష్మమ్మ సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా భర్త ఏడుకొండలు మూడు నెలల క్రితం రేబాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్నారు. అందుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను సమర్పించినా సచివాలయంలోని హెల్త్ అసిస్టెంట్ తనను రోజుల తరబడి తిప్పించుకుంటున్నారన్నారు. నువ్వు ఆయన భార్యవే అనే నమ్మకం ఏంటి, పెళ్లి కార్డు తీసుకుని రండి, మీ ఊరిలో అందరి చేత చెప్పించాలి అని చులకనగా మాట్లాడి, పురుష పదజాలంతో దూషిస్తున్నట్లు వాపోయారు. అతనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని, నా భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పిస్తే వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటానని తెలిపారు.



మాట్లాడుతున్న ఇండ్ల లక్ష్మమ్మ

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, తాగునీటి పైపులైన్ పనుల కారణంగా ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎన్‌ఎంసీ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశాలు, పీజీఆర్ఎస్ కార్యక్రమానికి కొందరు అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఇది పునరావృతం కాకూడదన్నారు. నగరంలో టిడ్కో గృహాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి, విజయదశమి నాటికి లబ్ధిదారులకు అందించనున్నామని తెలియజేశారు. నేషనల్ లోక్ అదాలత్ ద్వారా నగరపాలక సంస్థ పరిధిలో 13 భవనాల నుంచి అపరాధ రుసుం వసూలు చేశామని, అనుమతుల్లేని నిర్మాణాలు, అక్రమ కట్టడాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కాగా ప్రజా సమస్యలపై విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 3, ఆప్కాస్ 3, ఇంజినీరింగ్ 11, టిడ్కో హౌసింగ్ 20, రెవెన్యూ 7, టౌన్ ప్లానింగ్ 7, పబ్లిక్ హెల్త్ 4 చొప్పున మొత్తం 55 అర్జీలను అందుకున్నారు. వీటిని నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సెక్రటరీ శ్రీలక్ష్మి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా వస్తారు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ నివాసానికి సోమవారం ప్రసన్న వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు తారస్థాయికి చేరుకున్నాయన్నారు. కక్ష సాధింపులో భాగంగా లేని లిక్కర్‌స్కామ్‌ను సృష్టించి అక్రమంగా మిథున్ రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వివరించారు.



మాజీ మంత్రి అనిల్‌తో భేటీ అయిన ప్రసన్న

క్రీడాకారులను ప్రోత్సహించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంజీబీ ఫెలిసిటీ మాల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మల్లికార్జునరెడ్డి అన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్తంగా ఎంజీబీ మాల్లో నిర్వహించిన ఓపెన్ చెస్ పోటీల బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను వివరించి బహుమతులను అందజేశారు. పోటీలను విజయవంతం చేసినందుకు రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.సుమన్ హర్షం వ్యక్తం చేశారు. మాల్ అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ, ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ గోపీనాథ్, కోచ్‌లు సుమంత్, మధుసూదన్‌రెడ్డి తదితరులు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, కప్‌లను అందజేశారు.



విజేతలకు బహుమతుల అందజేత

విజేతగా జిల్లా వాసి

ఓపెన్ చెస్ పోటీల్లో జిల్లా వాసి వాకాటి పృథ్వీ కుమార్‌రెడ్డి ప్రథమ స్థానం సాధించారు. ద్వితీయ, తృతీయ స్థానాల్లో గుంటూరు జిల్లాకు చెందిన డి.ధృవేష్, ఎం.మహేంద్ర తేజాలు నిలిచారు.

స్మార్ట్ మీటర్లపై పోరుబాట

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్మార్ట్‌మీటర్లపై సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాటను నగరంలోని 53, 54 డివిజన్లలో సోమవారం నిర్వహించారు. వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేపట్టి, స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు మూలం ప్రసాద్ మాట్లాడుతూ, గతంలో నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, భయ్యన్న, వెంకటేశ్వర్లు, జాఫర్, కృష్ణ, బాబు పాల్గొన్నారు.

